కఠిన చట్టాలు చేయాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం దేశ ప్రతిష్టకే మాయని మచ్చలా మిగిలిపోతుంది. మహిళల భద్రతకు కఠిన చట్టాలు అమలు చేయాలి. ప్రజారోగ్యాన్ని కాపాడే వైద్యులపై దాడులు జరగడం హేయమైన చర్య. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బందిలో ఆత్మస్థైర్యం పెంపొందేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– కోలా అచ్చయ్య, ఇన్‌చార్జ్ సీహెచ్ఓ, జి.కొండూరు పీహెచ్‌సీ



శిక్షలు వెంటనే అమలు చేయాలి



మహిళలపై దాడులు చేస్తున్న నిందితులపై త్వరితగతిన విచారణ జరిపి వెంటనే శిక్షలు అమలు చేయాలి. మహిళపై చేయి వేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. వైద్యులపై, వైద్య సిబ్బందిపై తరచూ దాడులు జరగడం ఆందోళనకరం. కోల్‌కత్తా ఘటన హేయం. రాత్రి సమయాలలో విధులలో ఉండే మహిళా వైద్యులకు, సిబ్బందికి సరైన భద్ర కల్పించాలి. నిఘా ఏర్పాటు చేయాలి

-కె సాంబశివరావు, ఎంపీహెచ్ఎ, జి.కొండూరు పీహెచ్‌సీ

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

- తిరువూరు ఆర్డీఓ మాధవి
- పలు ప్రాంతాల్లో వన మహోత్సవం
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు

తిరువూరు: వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఇంటింటా మొక్కలు నాటాలని, ఇది అందరి బాధ్యత అని తిరువూరు ఆర్డీఓ మాధవి అన్నారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో, పొట్టి శ్రీరాములు పార్కులో శుక్రవారం ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. ఇంటి ఆవరణలో పండ్లు, పూలమొక్కలు నాటడంతో పాటు రహదారుల వెంబడి స్వచ్ఛంద సంస్థలు మొక్కలు నాటి పెంచే బాధ్యతను చేపట్టాలని సూచించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కమిషనర్ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణతో ఆరోగ్యకర జీవనం

జూపూడి(ఇబ్రహీంపట్నం): విరివిగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర జీవనాన్ని సాగిద్దామని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. జూపూడి గ్రామంలో వనం–మనం కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. కాలుష్యం నివారణతో పాటు ఆరోగ్యానికి వృక్ష సంపద ఎంతో అవసరమన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి కాకి దేవమాత, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవాళికి మేలు

జి.కొండూరు: మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా చేపట్టినప్పుడే అవి ఎదిగి మానవాళికి మేలు చేస్తాయని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. వనం–మనం



జూపూడిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వసంత, ప్రజాప్రతినిధులు

కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు సచివాలయం–2 వద్ద మండల ప్రత్యేకాధికారి మోహన్ బాబు, ఎంపీడీఓ అనూరాధతో కలిసి ఎంపీపీ శుక్రవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- **భవానీపురం(విజయవాడపశ్చిమ):** గొల్లపూడిలోని సాయిపురం కాలనీలో ఆర్‌డీఓ భవానీశంకర్ విజయవాడ రూరల్ తహసీల్దార్ బి. సుగుణతో కలిసి మొక్కలు నాటారు. ఆర్డీఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.
- **ఇబ్రహీంపట్నం:** తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు శుక్రవారం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ వనాలు పెంచడంతో కాలుష్యం నివారించబడుతుందన్నారు. డెప్యూటీ తహసీల్దార్ మహేష్, సీనియర్ అసిస్టెంట్ సుజాత, వీఆర్వోలు పాల్గొన్నారు.
- **గంపలగూడెం:** మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో తహసీల్దార్ రాజకుమారి మొక్కలు నాటి మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వరరావు, గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీడీఓ చెన్నయ్య, ఈవోపీఆర్డీ సునీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్, ఎంఈఓలు, అధికారులు పాల్గొన్నారు. మండలంలోని



తిరువూరు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్డీఓ



నూజివీడు సొసైటీ ఆవరణలో మొక్క నాటుతున్న రవికుమార్

24 గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ ప్రత్యేకాధికారులు మొక్కలు నాటారు.

- **మైలవరం:** మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో వనం–మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.గోపాల్, ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వనం–మనం కార్యక్రమంలో భాగంగా ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన ప్రారంభించి మాట్లాడారు. కార్యాలయ ఏఓ సాయిరాము, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.
- **చాట్రాయి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దుర్గాప్రసాద్ మొక్కలు నాటి మాట్లాడారు. వ్యవసాయాధికారి బి. శివశంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** పట్టణంలోని నూజివీడు సొసైటీ ఆవరణలో నూజివీడు విభాగ సహకార శాఖాధికారి మరీదు రవికుమార్ మొక్కలు నాటారు. సొసైటీ సీఈఓ నీలం నాగేశ్వరరావు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** జిల్లా పరిషత్ హైస్కూల్లో, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణరాజు, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ శంకరరావు మొక్కలు నాటి మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- **తిరువూరు:** మండలంలోని ఆంజనేయపురంలో సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ కోటేశ్వరమ్మ, గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎర్రమాడులో సర్పంచి బొర్రా మాధవి, వార్డు సభ్యులు మొక్కలు నాటారు. మల్లేల గ్రామ సచివాలయం, పాఠశాలల్లో సర్పంచి వంగూరి మరియమ్మ, సిబ్బంది, స్థానిక నాయకులు మొక్కలు నాటారు.
- **విస్సన్నపేట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి మొక్కలు నాటి మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి పెద్దిబాబు, ఏపీడీ పార్థసారథి, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల నైట్‌షిఫ్ట్ అలవెన్స్ అమలు చేయడంలో ట్రెజరీ అధికారుల మొండివైఖరికి వ్యతిరేకంగా శుక్రవారం తెల్లవారుజామున విధులకు హాజరైన పలువురు కండక్టర్లు, డ్రైవర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిపో యూనియన్ అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగుల వేతన బకాయిలు, అర్హులకు ఏఏఎస్ ఇంక్రిమెంట్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి రాష్ట్ర కమిటీ తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఉపాధ్యక్షుడు బీఎస్ రావు, పబ్లిసిటీ కార్యదర్శి మోహన్, జాయింట్ సెక్రటరీ వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **తిరువూరు:** ఆర్టీసీ తిరువూరు డిపో కార్మికులు శుక్రవారం తమ డిమాండ్ల సాధనకై ఆందోళన నిర్వహించారు. జీవో 114 అమలు, డ్రైవర్లకు రాత్రి షిఫ్ట్ అలవెన్సుల చెల్లింపు, సెలవును నగదుగా మార్పు, రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఆర్జిత సెలవు బకాయిల చెల్లింపు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ పోషణ వారం

ఇబ్రహీంపట్నం: జాతీయ పోషణ వారం కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో సంపూర్ణతా అభియాన్ ప్రణాళికపై వైద్య ఆరోగ్య సిబ్బందికి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే

తిరువూరు: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రాజుపేట అష్టలక్ష్మి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కాసులనాటి పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంతోషిమాత ఆలయం, కోదండ రామాలయం, వేంకటాచలస్వామి ఆలయం, రాజుపేట, చీరాల సెంటర్ ఆంజనేయస్వామి దేవాలయాలు, శాంతినగర్ కనక దుర్గాలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా లలితా సహస్ర నామ పారాయణం, సంకీర్తన నిర్వహించారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాచవరం రామలింగేశ్వర స్వామి ఆలయం, కొండపల్లి, ఇబ్రహీంపట్నంలోని శివాలయాల్లో స్వామి వారికి పంచామృత అభిషేకం, పార్వతి అమ్మవారికి కుంకుమపూజ, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వార్లను దర్శించుకున్నారు. కాచవరంలో అర్చకులు కంచిభొట్ల సుబ్రహ్మణ్యశర్మ పూజా సామగ్రి పంపిణీ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



మైలవరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

మైలవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

మైలవరం: ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయమైన మైలవరంలోని వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకర రావు ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. 120 మంది మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత మహిళలు స్థానిక శివాలయం నుంచి ఊరేగింపుగా వచ్చి పద్మావతి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్వీ నివృతరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు, జాస్తి వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- **నెమలి(గంపలగూడెం):** మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. నెమలి వేణుగోపాలస్వామి ఆలయం, ఊటుకూరు కోదండ రామాలయం, గంపలగూడెం సీతారామ చంద్రస్వామి ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు.
- **ముసునూరు:** లోపూడి శివారు బాసవరప్పాడులోని కోదండ రామాలయంలో సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి మహిళలు పెద్ద సంఖ్యలో పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామ కన్వీనర్లు పొన్నగంటి అశోక్, పరుచూరి లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

జి.కొండూరు: చెవుటూరు గ్రామానికి చెందిన యువకుడు లక్ష్మణరావు ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. చికిత్స, పోషణ ఆ కుటుంబానికి భారంగా మారడంతో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను ఆశ్రయించారు. ఎమ్మెల్యే చొరవతో స్పందించిన న్యూజిలాండ్ టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధులు రూ.1.40 లక్షలను ప్రకటించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం చెక్కును అందజేశారు.

- **భవానీపురం(విజయవాడపశ్చిమ):** జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామానికి చెందిన ప్రత్తిపాటి వరుణ్ ఈ నెల 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితునికి ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గొల్లపూడిలోని తన కార్యాలయంలో అందజేశారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత, మంత్రి టీజీ భరత్

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ లోవరాజు తెలిపారు. కౌన్సిలర్లు ప్రతిపాదించిన అంశాలపై రూపొందించిన అజెండాపై నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చించి తీర్మానిస్తారు.

నేడు నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: నూజివీడు పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి తెలిపారు. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశీలన

ముసునూరు: లోపూడి, శివారు గ్రామం బాసవరప్పాడులో రూ.68 లక్షలతో నిర్మించిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, రెండు బోర్లు, మూడు మోటార్లు, పైపులైన్లను ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సురేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, క్వాలిటీ కంట్రోల్ ఏఈ ఏబీ నాగేశ్వర్ పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ విధానానికి నిరసన

తిరువూరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. వినయ్‌కుమార్, పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరంలో శుక్రవారం యూటీఎఫ్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం. తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి వసంతరావు పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ఏఐ, డాటా సైన్స్ విద్యార్థుల సహకారంతో విద్యా పరికరాలు అందజేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, పిల్లల తల్లులకు దుప్పట్లు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

ఎల్బీఆర్సీఈ అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డాటా సైన్స్ విభాగంలో అధ్యాపకులు చనుమోలు కిరణ్‌కుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. వీఐటీ–ఏపీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డిటెక్షన్ అండ్ మిటిగేషన్ ఆఫ్ పొల్యూషన్ అటాక్స్ ఇన్ నెట్‌వర్క్ కోడింగ్ ఎనేబుల్డ్ స్మాల్ సెల్ నెట్‌వర్క్స్ అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు పీహెచ్‌డీ లభించింది. ఈ సందర్భంగా అధ్యాపకులు కిరణ్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కళాశాల యాజమాన్యం అభినందించారు.

కులదూషణ కేసు నమోదు చేయాలని రాస్తారోకో

తిరువూరు: మండలంలోని పెద్దవరంలో చేపల సొసైటీ సభ్యత్వం అడిగిన దళితులను కులం పేరుతో దూషించిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ శుక్రవారం తిరువూరు బోస్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. నాయకులు మాట్లాడుతూ పెద్దవరానికి చెందిన యువరాజు, మరికొందరిని కులం పేరుతో దూషించి అవమానించిన నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు ఉదాసీనవైఖరి అవలంబిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. నిందితులను అరెస్ట్ చేసేవరకు దశల వారీగా ఆందోళన కొనసాగిస్తామన్నారు.

బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: ప్రయాణికులు, విద్యార్థుల రద్దీ దృష్ట్యా 188 రూట్‌లో మరో బస్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇబ్రహీంపట్నం, గన్నవరం ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి అదనపు బస్సు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

చనుబండలో వైద్య శిబిరం

చాట్రాయి: చనుబండ గ్రామంలో శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు దుర్గాప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

క్లుప్తంగా

గురుకులాన్ని సందర్శించిన జడ్జి



తిరువూరు: ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె. మోతీలాల్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎ. కొండూరు ప్రాంతంలో కిడ్నీ బాధితులందరికీ డయాలసిస్‌తో సంబంధం లేకుండా నెలకు రూ. 10 వేలు పింఛను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమాన్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ వ్యాధితో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒక హెక్టార్ భూమి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిడ్నీ బాధితులకు పౌష్టికాహారం అందించాలని, డయాలసిస్ సెంటర్లలో అనుభవజ్ఞులైన వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటుచేసి గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రతి వ్యక్తి మానసిక ఆరోగ్యంతో ఆహ్లాదకరమైన జీవితం గడుపుతారని సాంత్వన ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు అన్నారు. సీకే బిర్లా గ్రూప్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా స్థానిక గాజులపేటలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక ఆరోగ్యంపై ఏఎన్ఎం, ఆశాలకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్త సర్వే ప్రకారం 15 కోట్ల మందికి మానసిక ఆరోగ్యంపై అత్యవసర వైద్యం ఇవ్వాల్సి ఉందన్నారు. మానసిక స్థితి సక్రమంగా లేని వారు పీహెచ్‌సీలు, వైద్యశాలల్లో చికిత్స పొందాలని సూచించారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు రోహిత్, వాసవ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

తిరువూరు: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించేందుకు చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి తిరువూరు కోర్టు శుక్రవారం జరిమానా, జైలుశిక్ష విధించింది. తిరువూరుకు చెందిన కప్పల రామకృష్ణ వద్ద ఖమ్మం జిల్లా మర్లపాడుకు చెందిన అర్వేపల్లి లింగారావు 2016లో రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ అప్పు తిరిగి చెల్లించేందుకు లింగారావు 2018లో ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో రామకృష్ణ కోర్టులో కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం లింగారావుకు 6 నెలల జైలు, రూ.4 లక్షల నష్టపరిహారం కింద జరిమానా విధిస్తూ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎ. సింధూర తీర్పు చెప్పారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

గణపవరం(మైలవరం): చంద్రాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గణపవరం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ కళ్ల పట్ల ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాస్పత్రి ఆప్తమాలజీ విభాగం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం

ఆగిరిపల్లి: తోటపల్లిలోని దుగ్గిరాల రావమ్మ తల్లి ఆలయంలో భక్తుల విశ్రాంతి గది నిర్మాణానికి గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లికి చెందిన ఈగ మాధవరావు రూ.1.05 లక్షలను విరాళంగా ఆలయ ఈఓ సురేష్‌బాబుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.

రేపు ‘తిరువూరు కోసం పరుగు’

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ సెప్టెంబరు 1న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ‘తిరువూరు కోసం పరుగు’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఉదయం 7 గంటలకు విజయవాడ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి జరిగే ఈ పరుగులో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, న్యాయవాదులు, వైద్యులు పాల్గొనాలని కోరారు.